# హంసలను వేటాడొద్దు [3]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [3]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మార్చి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2085

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

దీని ముందు భాగం

**జరిగిన కథ:** యెగార్ పొలుష్కిన్ అమాయకుడు. కానీ నిపుణుడైన వడ్రంగి. భార్య హారిటీనా అతణ్ణి అసమర్థునిగా జమకట్టి నిత్యం నస పెడుతూ, దెప్పి పొడుస్తూ ఉంటుంది. హారిటీనా చెల్లి మార్యా, ఆమె భర్త ఫ్యాడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ లు కూడా అదే ఊళ్ళో ఉంటారు. ఫ్యాడార్ ఊరి చుట్టు పక్కల అడవులు కొట్టించి కలప వ్యాపారం చేసి ధనవంతుడవుతాడు. అతను కూడా యెగార్ ను అసమర్థునిగానే భావిస్తాడు. కానీ వడ్రంగం పనిలో అతని నైపుణ్యం తెలిసి అతని చేతే తన ఇల్లు కట్టించుకుంటాడు. తన పాత ఇల్లు యెగార్ కి ఇస్తాడు. యెగార్ కొడుకు కోల్కా కూడా తండ్రిలాగే అమాయకుడు, మంచివాడు. ఊళ్ళోవాళ్ళూ తోటి పిల్లలూ తండ్రిని అవమానించటం వాడికి నచ్చదు. ఫ్యాడార్ ఇంటి పని పూర్తి చేశాకా యెగార్కి ఎక్కడా కొత్త పని దొరకటం లేదు. **ఇక చదవండి:——**

## 3

కొత్త ప్రదేశంలో యెగార్ పొలుష్కిన్‌కి అదృష్టం కలిసి రాలేదు. మొదటి రెండు నెలలు ఫ్యాడార్ ఇపటొవిచ్ ఇల్లు కట్టటంలో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పనిచేస్తున్నప్పుడు అంతా బాగానే ఉన్నట్టు అనిపించింది. ఫ్యాడార్ ఇపటొవిచ్ అతడికి దారి చూపినప్పటికీ, అతడిని ఒత్తిడి చేయలేదు – అలా చేస్తే ఇల్లు బాగా తయరై ఉండేది కాదు. నిపుణుడైన వృత్తికారుడిని హడావిడి పెట్టకూడదు – నిపుణుడు తనకు తానే యజమాని: అతనిని పనిలో పెట్టుకున్నవాళ్ళకి ఆ విషయం తెలుస్తుంది. యెగార్ చుట్టూ ఫ్యాడార్ తిరిగేవాడు కానీ అతడిని ఎప్పుడూ నిజంగా తొందరపెట్టలేదు. యెగార్ తన మనస్సు చెప్పినట్టు పనిచేసేవాడు: కాసేపు పని చేస్తే, కాసేపు విశ్రాంతి తీసుకునేవాడు, ఒక్కొక్కసారి కొంచెం దూరం జరిగి చేసిన పని ఎలా ఉందో చూసేవాడు. పనిలో ఎక్కడా తొందరపడలేదు, హడావిడి చేయలేదు. నిదానంగా, ప్రశాంతంగా మధ్యమధ్యలో చుట్టకాలుస్తూ చేశాడు. ఆ పని అతడికి, అతని కుటుంబానికి తిండిపెట్టింది, అతడికి ఒక పాత ప్యాంటు, ఒక ఇల్లు ఇచ్చింది. జరిగినదానికి యెగార్ బాధపడటం లేదు, కోపమూ లేదు: చట్టప్రకారం ఒప్పందంలోనివన్నీ పూర్తి అయ్యాయి. కొత్త ఇంట్లో స్థిరపడటానికి అతడికి పదిహేను

రోజులు పట్టింది, ఒక వారం రోజులపాటు దానిని ఆస్వాదించాడు. ఆ తరువాత పనికోసం వెళ్లాడు. ఈసారి బంధువులకు ఇల్లు, సదుపాయాలు కల్పించటానికి కాదు, తన పొట్టకూటికి.

వడ్రంగి ఎంతైనా వడ్రంగే: అతడు పని వెతుక్కోనవసరం లేదు, పనే అతడిని వెతుక్కుంటూ వస్తుంది. అంతే కాకుండా అతడి పనితనాన్ని ఊరంతా చూసింది – గొడ్డలితో అతడు చేసిన కోడిపుంజు కూత ఇంటి కప్పు మీదనుంచి దిగంతాలవరకు వినిపిస్తున్నట్టు ఉండేది. స్థానిక భవన నిర్మాణ సంస్థలోని వడ్రంగుల బృందంలోకి అతడిని తీసుకున్నారు. అయితే, నెలరోజులు గడిచిన తరువాత...

"పొలుష్కిన్! ఆ గోడను పట్టుకుని ఎంతసేపు వేలాడతావు?"

"అదీ, ఇక్కడ... ఈ రెండు చెక్కలు సరిగా కలవలేదు."

"ఆ చెక్కలను వదిలిదొబ్బు! నువ్వు ఏమైనా ఇక్కడ ఉండబోతున్నవా ఏమిటి? మన కోటాలు, బోనస్ లు–"

"అవుననుకో, కానీ ఇక్కడ మనుషులు –"

"ముందు ఆ నిచ్చెన దిగు! మరో పనికి పద!"

"కానీ, ఈ ఖాళీలు... "

"కిందకి దిగమని చెప్పాను!"

యెగార్ కిందికి దిగిరాక తప్పింది కాదు. కిందికి దిగి మరో పనికి వెళ్లాడు. కానీ తను చేసిన పనిని చూడటానికి తానే సిగ్గుపడ్డాడు. ఫోర్ మాన్ నిరంతర తిట్లతో తరువాత పని నుంచి కూడా కదిలి మరొక పనికి కదిలాడు, మరొక బహుళ అంతస్తుల భవనం. అక్కడ ఏదో పని చేసేవాడు. ఆత్మ సంతృప్తి కలిగేలా పనిచెయ్యనివ్వకుండా అతడిని ఒకచోటునుంచి ఇంకోచోటుకు లాక్కెళ్లేవాళ్లు. అలా ఒక నెల గడిచిన తరువాత ఒక రోజు ఇంకా అయిదు గంటల పని ఉండగానే యెగార్ తన గొడ్డలి తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

"నేను అక్కడ పని చెయ్యలేను, టీనా. నువ్వు కోపం తెచ్చుకోవద్దు. అక్కడ ఎవ్వరూ పని చెయ్యరు – అంతా పైపై నాటకం."

"ఎందుకూ పనికిరాని ఏమీ చేతకాని నా జీవితానికి పట్టుకున్న దరిద్రమా!"

"అహ్, ఆః... అలాగే ఉన్నట్టుంది..."

అతడు మరొక బృందంలోకి మారాడు, మరొక సంస్థకి మారాడు, ఆ తరువాత మరో చోటుకి మారాడు. ఎక్కడా నిలకడగా ఉండలేకపోయాడు, ఎక్కడా అతడికి శాంతి దొరకలేదు. అన్ని రకాల తిట్లు భరించాడు. కానీ ఏదో చేశామంటే చేశామనే పనితో మాత్రం అతడు సర్దుకుపోలేకపోయాడు. అతడు ఒక పనినుంచి మరొక పనికి, ఒక బృందం నుంచి మరొక బృందానికి మారుతూనే ఉన్నాడు. చివరికి అతడు వెళ్లని ప్రదేశం లేదు, చూడని బృందం లేదు. దాంతో అతడు రోజు కూలీగా మారాడు. అంటే ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్లాలి, ఏ పని చెబితే అది చేయాలి.

అయితే, ఇక్కడ కూడా ఏదీ సాఫీగా సాగలేదు. అది మే నెల, గడ్డకట్టిన మంచు అప్పుడే కరిగింది. మురుగునీటి వ్యవస్థ కోసం కాలవ తవ్వే పనిని అతడికి అప్పగించారు. ఫోర్‌మాన్ స్వయంగా కట్టెపుల్లలకు తాడు కట్టి నేలలోకి దించాడు, గడ్డపారకు గుర్తుపెట్టి ఎంత లోతు తవ్వాలో చూపించాడు.

"ఇంత లోతు తవ్వాలి, పొలుష్కిన్. దారం వెంట తిన్నగా తవ్వు."

"అలాగే."

"మట్టిని ఎటుపడితే అటుకాకుండా అంతా ఒక వైపుకి వెయ్యి."

"అలాగే..."

"ఇంత పని చెయ్యాలని నీకు చెప్పను. నువ్వు మనసుపెట్టి చేస్తావని నాకు తెలుసు. కానీ కనీసం –"

"నువ్వేమీ ఆందోళన పడవద్దు."

"సరే, పొలుష్కిన్. ఇక పని మొదలుపెట్టు."

చేతుల్లో ఉమ్మి ఊసుకుని యెగార్ పని మొదలుపెట్టాడు. నేల గుల్లగా ఉండి తవ్వుతుంటే కమ్మటి వాసన వస్తోంది. పారకి మట్టి ఏమాత్రం అంటుకోవటంలేదు. మట్టినుంచి వచ్చే నునువెచ్చని వేడిమికి యెగార్ సంతోషించాడు, సంతృప్తిచెందాడు. ఒకప్పుడు తమ ఊళ్లో పనిచేసినట్టు ఆనందంగానూ, శ్రద్ధతోనూ పనిచేయసాగాడు. మే నెల సూర్యుడు కాంతివంతంగా ఉన్నాడు, పిచ్చుకలు సంతోషంగా కిచకిచలాడుతున్నాయి, ఆకాశం ముదురు నీలం రంగులో

మెరుస్తోంది, గాలి సజీవంగా ఉంది! మధ్యమధ్యలో చుట్ట కాల్చే సంగతి కూడా మరిచిపోయి పని చేస్తున్నాడు యెగార్. కాలవ అడుగు, గోడలు ఎప్పటికప్పుడు చక్కగా చెక్కుతున్నాడు.

ఎందుకైనా మంచిదని మూడుగంటల తరువాత పని ఎలా జరుగుతోందో చూడటానికి వచ్చిన ఫోర్‌మాన్ అతడు చేసిన పనిని చూసి ఉత్సాహంగా, "నువ్వు చాలా పనిమంతుడివోయ్, పొలుష్కిన్!" అన్నాడు. అంతే కాదు, "నువ్వు పని చేస్తున్నట్టులేదు, చక్కని దస్తూరితో రాస్తున్నట్టు ఉంది!" అని మెచ్చుకున్నాడు కూడా.

యెగార్‌కి రాయటం అంత బాగా రాదు, అందుకని అతడి ప్రశంసను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాడు. కాని అతని గొంతులో మెచ్చుకోలు స్పష్టంగానే తెలుస్తోంది. అంతటి మంచి మనిషిని మెప్పించటానికి యెగార్ మరింత శ్రమించాడు. పని గంటలు పూర్తి అయ్యే సమయానికి ఆ రోజుకి ఎంత పని జరిగిందో చూద్దామని వచ్చిన ఫోర్‌మాన్‌కి మూడు రోజులలో తవ్వాల్సినంత కందకం పూర్తయ్యి కనపడింది.

"మూడు రోజుల పని చేశావు!" కాలవ పక్కన నడుస్తూ ఆశ్చర్యపోయాడు ఫోర్‌మాన్. "పొలుష్కిన్, అందరిలోకి నువ్వు చాలా పనిమంతుడివి. నిన్ను –"

అతడి మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. తాడు వెంట తిన్నగా ఉన్న కందకం ఒక గడ్డి దుబ్బు – అదేమంత పెద్ద దుబ్బు కాదు – చుట్టూతా ఒంపు తిరిగి మళ్లీ బాణం మాదిరి తిన్నగా దూసుకుపోయింది. తన కళ్లను తానే నమ్మలేక ఫోర్‌మాన్ చిత్రంగా ఒంపు తిరిగిన కాలవనీ, ఆ గడ్డి దుబ్బుని కాసేపు మార్చి, మార్చి చూసాడు. చివరికి తన వేలు చూపిస్తూ, "ఏమిటది?" అని అడిగాడు. అతడి మాట గుసగుసలాడినట్టు ఉంది.

"చీమలు," యెగార్ వివరించాడు.

"ఏం చీమలు?"

"అహ్, ఆఁ... అవి నీకు తెలుసుగా... ఎర్ర చీమలు. మొత్తం కుటుంబం ఉన్నట్టు అనిపించింది– వాటి ఇల్లు, పిల్లలు. వాటి ఇల్లు ఆ గడ్డి దుబ్బులో ఉంది. "

"వాటి ఇల్లు అనేనా నువ్వు అంది?"

"అహ్... నీకు తెలుసుగా, చూస్తే అలా అనిపించింది–"

"చూస్తే నీకు అలా అనిపించింది కదూ?"

ఆ మాటలు యెగార్‌కి ఏదో ఉపద్రవానికి సూచికగా అనిపించి వాటిని తిరిగి ప్రస్తావించలేదు. అంతకు ముందు చేసిన ప్రశంసకు అతడు అర్హుడే, నగరపాలక నిర్మాణానికి దారిలో ఉన్న చీమల పుట్టను కాపాడటానికి అతడు తన సొంత చొరవతో చర్య తీసుకున్నాడు. అందుకనే అతడు ఉత్సాహంగా, "ఏ కారణం లేకుండా దానిని ధ్వంసం చేయటమెందుకు? నేనే దాని చుట్టూతా తవ్వితే పోలా అనుకుని-"

"మరి నేను వంకర పైపులు ఎక్కడనుంచి పట్టుకురాను? దాని గురించి ఏమైనా ఆలోచించావా? పోతపోసిన ఇనప పైపులలో మలుపు తిప్పటానికి ఎవరి తల పెట్టాలి? దాని గురించి ఆలోచించావా? దేవుడా, ఇతనితో ఎలా..."

చీమలపుట్టను తప్పిస్తూ వంకరగా తవ్విన కాలవ గురించి ఫోర్‌మాన్ కనపడినవాళ్లకి, కనపడని వాళ్లకి అందరికీ చెప్పాడు. దాంతో యెగర్‌కి తల ఎక్కడ పెట్టుకోవలో తెలియలేదు. అయితే యెగార్‌కి ఉన్న అత్యంత సహనశక్తితో దీనినంతటినీ ఎలాగో భరించాడు, వెర్రి నవ్వు కూడా ఒకటి నవ్వేవాడు. కోల్కా మాత్రం తల నుంచి పాదాల దాకా దెబ్బలతో తిరుగుతున్నాడు. ఆ దెబ్బలను యెగార్ వెంటనే గమనించాడు. కానీ, కొడుకుని ఏమనకుండా ఒంటరిగా విడిచిపెట్టాడు, ఒక నిట్టూర్పు వదిలాడంతే. అయితే ఒక వారం తరువాత కోల్కా వాళ్ల టీచరు యెగార్‌ని వెతుక్కుంటూ వచ్చింది.

"యెగార్ సవెలిచ్ పొలుష్కిన్ మీరేనా?"

యెగార్‌ని అతని పూర్తి ఇంటిపేరుతో ఎవరైనా పిలవటం అరుదు, చాలా చాలా అరుదు! పిట్టంత ఉన్న ఈ అమ్మాయి ఎంతో గౌరవంగా సంభోదిస్తోంది.

"అయిదు రోజులనుంచి కోల్కా బడికి రావటంలేదని మీకు తెలుసా?"

"ఏమయ్యింది?"

"ఎవరో అతణ్ణి బాగా ఇబ్బంది పెడుతున్నట్టున్నారు, యెగార్ సవెలిచ్. ముందు అందరితో గొడవలు పెట్టుకున్నాడు, ఆ తరువాత కనపడకుండా పోయాడు. నిన్న బజారులో కనపడ్డాడు. ఏం జరిగిందని అడిగే లోపల పారిపోయాడు."

"వాడి పద్ధతి బాలేదు."

"అతనితో మాట్లాడండి యెగార్ సవెలిచ్. కానీ అతడిని కోప్పడకండి: చాలా సున్నిత మనస్కుడు."

"తప్పకుండా మాట్లాడతాను. మీరు ఇంత శ్రమ తీసుకున్నందుకు ధన్యవాదాలు."

ఆ రోజు చీకటిపడి అందరి ఇళ్ల కిటికీల నుంచి టీవీల నీలం కాంతి కనపడుతున్న సమయంలో యెగార్‌కి కోల్కా కొట్టంలో కనిపించాడు. కోల్కా నిద్రపోతున్నట్టు నటిస్తూ, పందిపిల్ల కంటే పెద్దగా గురకపెట్టసాగాడు. అతని తండ్రి అతడిని లేపటానికి ప్రయత్నించలేదు. అతడి మంచంమీద కూర్చుని పొగాకు బయటకు తీసి చుట్ట చుట్టుకోసాగాడు.

"ఇందాక మీ టీచరు వచ్చి వెళ్లారు. మంచావిడ."

కోల్కా నిశ్శబ్దంగా మారిపోయాడు. పందిపిల్ల కూడా అరుపులు ఆపింది.

"ఆవిడకు ఎటువంటి ఇబ్బంది కలిగించకు, కొడుకా. ఆవిడ కష్టాలకు మనం కొత్తగా జోడించవద్దు."

కోల్కా ఇటు తిరిగి, లేచి కూర్చుని కళ్లు పెద్దవి చేసి చూడసాగాడు. ఆ కళ్లల్లో తడి లేదు కాని కోపం ఉంది.

"టోల్యా బెజుగ్లోవ్ పన్ను ఊడగొట్టాను!"

"అయ్యో! ఎందుకురా?"

"వాడు ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు."

"నవ్వితే నవ్వనీ. ఏడవటం మంచిది కాదు, కానీ నవ్వటం ఎప్పుడైనా మంచిదే."

"కానీ వాడు నిన్ను చూసి నవ్వుతున్నాడు! నిన్ను చూసి! చీమలపుట్ట చుట్టూ కాలవ ఎలా తవ్వావో చెప్పి నవ్వుతున్నాడు."

"అవును, నేను తవ్వాను," యెగార్ ఒప్పుకున్నాడు. "ఇనప పైపులు ఒంపు తిరిగి ఉండవన్న సంగతి నేను మరిచిపోయాను. ఆ చీమలను చూసి పాపం అనిపించింది: వాటికి చిరపరిచితమైన ప్రదేశం అది, వాటి ఇల్లు, పిల్లలు అక్కడే ఉన్నాయి."

"దానివల్ల నువ్వు నవ్వులపాలు కావటం తప్పించి ఏమి ఒరిగింది? వాళ్లు ఎలాగూ కాలవని తిన్నగా తవ్వారు – ఏ ప్రయోజనమూ లేకుండా చెడ్డ పేరు వచ్చింది."

"కానీ నాకు చెడ్డ పేరు ఏమీ రాలేదు, కొడుకా. అయితే..." యెగార్ నిట్టూర్చాడు, చెదిరిన ఆలోచనలను కూడగట్టుకుంటూ కాసేపు ఆగాడు. "పనిని ఏది పట్టి ఉంచుతుందనుకుంటున్నావు?"

"తల!"

"అది కూడా. నీ తల, చేతులు, నైపుణ్యం, కానీ అన్నిటికంటే ముఖ్యం నీ హృదయం. మనిషి తన హృదయంతో కొండలను కదిలించగలడు. కానీ పని చేయటం కేవలం ఆహారం సంపాదించటం కోసమైతే అది నీ చేతివేళ్లనుంచి జారిపోతుంది. అది నిలవదు. అప్పుడు నీ చేతులు వట్టి బొటనవేళ్లు అవుతాయి, నీ తల ఖాళీ కుండ మాదిరి అవుతుంది. దేవుడు కరుణించి నీకు మంచి స్థానం దొరకాలి. ఎందుకంటే ఆ స్థానమే హృదయానికి సంబంధించి మొత్తం నిర్ణయిస్తుంది. నా విషయానికి వస్తే నేను సరైన స్థానానికి రాలేదు: నా మనస్సుకి ఇక్కడ ప్రశాంతత చిక్కలేదు — అది గందరగోళంగా ఉంది. ఈ ప్రదేశమంతా మోతగా ఉంది. ఇక్కడ మనుషులకు ఓపిక లేదు. అధికారులు కూడా ఎప్పుడూ హడావిడిగా ఒత్తిడి పెడుతూ, అరుస్తూ ఉంటారు. వీటన్నిటి కారణంగా నన్ను నేను ఇక్కడ కోల్పోయాను. తిరిగి నన్ను నేను కనుక్కోవటం ఎలాగో తెలియటం లేదు. ఈ తెలియకపోవటమే సమస్య అంతా. వాళ్లు నన్ను చూసి నవ్వటం విషయానికి వస్తే, వాళ్లని మనసారా నవ్వుకోని. వాళ్ల మీద కోపం తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. మనుషుల పట్ల ద్వేషం పెంచుకోవటం అన్నది కూడనిది — ఎన్నటికీ కూడనిది."

ఇదంతా తన కొడుక్కి ఒక పాఠం చెప్పినట్టు చెప్పలేదు, తన అంతరాత్మ చెప్పినట్టు చెప్పాడు. అతడికి ఇతరుల పట్ల కోపం రాదు, అవమానాలను తేలికగా క్షమించేసేవాడు, ఊరంతటిలో తన పరువు పోగొట్టి, ఎక్కడా పనిలేకుండా చేసిన ఫోర్‌మాన్ అంటే కూడా అతనికి ఇసుమంతైనా ద్వేషం లేదు. పని కోసం మళ్లీ నియామకపు సంస్థ దగ్గరకు వెళ్లాడు.

"నీతో ఏం చేయాలి, పోలుష్కిన్?" సూపర్‌వైజరు నిట్టూర్చాడు. "నువ్వు నిశ్శబ్దంగా ఉంటావు, కష్టపడి పని చేస్తావు, నీకు తాగుడు అలవాటు కూడా లేదు, పోషించాల్సిన కుటుంబం ఉంది. కానీ, నువ్వు ఎక్కడా రెండు వారాల కంటే ఎక్కువ నిలబడలేకపోతున్నావు... నిన్ను ఎక్కడికి..."

"నీ ఇష్టం," అన్నాడు యెగార్. "ఎక్కడ పని ఉంటే అక్కడికి."

"పని!" సూపర్‌వైజరు బుగ్గలు పూరించి గాలి వదిలాడు, తల గోక్కున్నాడు. "చూడు, పోలుష్కిన్. ఇక్కడ చెరువులో పడవలు అద్దెకు ఇవ్వబోతున్నారు. నిన్ను సరంగును చేస్తే పోతుందేమొ? ఏమంటావు?"

"సరే," అన్నాడు యెగార్. "నేను తెడ్డు వెయ్యగలను, తారు పూసి పడవలోకి నీళ్లు రాకుండా చెయ్యగలను. ఇది బాగానే ఉంటుంది."

గత వేసవిలో ఊరి పక్కన ఉన్న చిన్న నది మీద ఆనకట్ట కట్టారు. దాంతో నది పొంగి లోయలనన్నింటిని నింపి, అడవివైపుకి విస్తరించింది: నల్ల సరస్సు దగ్గర మిగిలి ఉన్న కాస్తంత అడవి అదే. నీళ్లు రావటంతో మోళ్లు మళ్లీ చిగురించాయి. భుజపత్ర (బిర్చ్), బండిగురువింద (ఫిర్), కవుకు (పైన్) చెట్లు మళ్లీ కళకళలాడుతున్నాయి. స్థానిక ప్రజలే కాక జిల్లా కేంద్రంనుంచి పర్యాటకులు రావటం మొదలుపెట్టారు. మాస్కోనుంచి కూడా పర్యాటకులు వస్తున్నారని అంటున్నారు.

ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకోవచ్చో స్థానిక అధికారులు గ్రహించారు. పర్యాటకులకు, ప్రత్యేకించి రాజధాని నుంచి వచ్చినవాళ్లకు ఏం కావాలి? వాళ్లకు ప్రకృతి కావాలి. కంకర, రాయితో కట్టిన ఎత్తైన భవనాల మధ్య వసంతకాలం నుంచి ప్రకృతి కోసం బెంగపెట్టుకుంటారు. భూమితో వాళ్ల సంబంధాన్ని రాతి గచ్చు తెంచేస్తుంది. ఈ రాయి వాళ్ల ఆత్మను మొద్దుబరచటమే కాదు, నిర్విరామంగా ఆందోళనపరుస్తూనే ఉంటుంది. ఎందుకంటే రాయి నగరమోతలను నిశ్శబ్దపరచలేదు. చెక్కలాగా అది వెచ్చగా ఉండదు, అన్నింటినీ ఓర్చుకోలేదు. ఈ నగరమోతలు రాయి, సిమెంటునుంచి ప్రతిధ్వనించి, బజారులు, వీధులగుండా పయనించి, ఇళ్లల్లోకి జొరబడి ఎటువంటి రక్షణలేని మానవ ఆత్మను కుదిపేస్తుంది. దానితో ఆత్మకు రాత్రి, పగలు ప్రశాంతత చిక్కదు. అది కలలో మాత్రమే మంచు ముసుగులోని సూర్యోదయాలను, అందమైన సూర్యాస్తమయాలను చూస్తుంది. రోజంతా పనిచేసిన గని కార్మికుడు రొట్టె, పప్పు కోసం ఎట్లా ఎదురు చూస్తాడో ఈ మానవ ఆత్మ కూడా అలాగే ప్రశాంతతను కోరుకుంటుంది.

అయితే నగరవాసిని మీరు స్వచ్ఛమైన, కల్తీకాని ప్రకృతితో ఆకట్టుకోలేరు. ముందుగా కల్తీకాని ప్రకృతి అంతగా మిగల్లేదు. అదీ కాకుండా ఈ నగర పర్యాటకులు ఊరికే ఉండలేరు. వాళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి చేయటానికి, పరుగులు పెట్టటానికి అలవాటు పడ్డారు. కాబట్టి వాగు పక్కన

ఏమీ చేయకుండా మహా అయితే రెండుగంటలపాటు కూర్చుంటారేమో. తరువాత పెద్ద శబ్దంతో రేడియో పెడతారు, లేదా, మద్యం సీసా తీస్తారు. ఒక సీసా తీసిన తరువాత రెండవది దాని వెంటనే ఉంటుంది. రెండవ సీసాని అంటిపెట్టుకుని అల్లరి తప్పకుండా ఉంటుంది. దీన్ని నివారించటానికి పర్యాటకుల దృష్టిని మళ్లించాలి. వాళ్లకి ఒక పడవ ఇవ్వండి, చేపలు పట్టటానికి ఏర్పాటు చేయండి, పుట్టగొడుగులు, పళ్లు ఏరించండి, కొన్ని సౌకర్యాలు కల్పించండి. దీనివల్ల రెండు లాభాలు ఉన్నాయి: అల్లరి తగ్గుతుంది, ప్రతి ఒక్కరు ఎంతోకొంత ఖర్చుపెడతారు కాబట్టి పర్యాటకుల జేబుల నుంచి కొంత ఆదాయం స్థానిక సంస్థలకు లభిస్తుంది. ఇటువంటి వినోదాలు, సదుపాయాలకు వాళ్లు తప్పనిసరిగా ఖర్చుపెడతారు.

పడవలు అద్దెకు ఇచ్చే కేంద్ర సంచాలకుడైన యకోవ్ ప్రొకొపిచ్ సజనోవ్ ఇదంతా యెగార్‌కి వివరించాడు. అతడు చాలా పెద్దవాడు, జీవితమంటే అలసిపోయి ఉన్నాడు. ముఖంలో ఎటువంటి భావం కనపడకుండా మెల్లగా మాట్లాడేవాడు. యకోవ్ కలప కొట్టే బృందానికి మేస్త్రిగా పని చేస్తుండగా జారి పడిపోయాడు: ఆ పడటం కిందకి ఒరిగిపడతోన్న పెద్ద కవుకు చెట్టుకింద పడ్డాడు. తిరిగి మామూలు పరిస్థితికి రావటానికి ఆసుపత్రిలో ఆరునెలలు ఉండాల్సి వచ్చింది. కాస్త తిరగటం మొదలు పెట్టిన తరువాత పడవలు అద్దెకు ఇచ్చే ఈ కేంద్రానికి పంపించారు.

"నీ బాధ్యతలు ఏమిటో తెలుసా, పొలుష్కిన్? ముందుగా అన్నింటి మరమ్మతులు పూర్తి చేయాలి. ప్రతిదీ సరిగా ఉండాలి: సీట్లు వాటి స్థానంలో ఉండాలి, అడుగు చెక్కలు గట్టిగా ఉండాలి, తెడ్లు బాగుండాలి, పడవలలో చారెడు కంటే ఎక్కువ నీళ్లు ఉండకూడదు."

"నాకు అర్థమయ్యింది," యెగార్ ఆత్మవిశ్వసంతో చెప్పాడు. "పడవలను పొడిగా ఉంచుతాను."

"నీ రెండవ బాధ్యత ఏమిటో తెలుసా? పడవల రేవు. ఇంటిని ఇల్లాలు ఉంచినంత శుభ్రంగా నువ్వు రేవుని ఉంచాలి."

"తెలిసింది. కిందపడింది తీసుకుని తినేంత శుభ్రంగా దాన్ని ఉంచుతాను."

"అక్కడ తినుబండారాలకు అనుమతి లేదు," యకోవ్ ప్రొకొపిచ్ విసుగ్గా అన్నాడు. "పందిరి వేసి దానికింద కొన్ని కుర్చీలు వేద్దాం. మద్యం లేకుండా విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేద్దాం. కావాలంటే టీ పెట్టవచ్చు. లేకపోతే ఎవరైనా తాగి నీళ్లల్లో పడిపోతే మనల్ని పట్టుకుంటారు."

"వాళ్లవెంట మద్యం తెచ్చుకుంటే?"

"వాళ్లు స్వేచ్ఛా జీవులు: వాళ్లు తెచ్చుకుంటే మనకు బాధ్యతలేదు. కానీ వాళ్ల వెంట రెండు సీసాలు తెచ్చుకుంటే – అప్పుడు మనం అభ్యంతరం పెట్టవచ్చు."

"ఆహ్హా!"

"అయితే మర్యాదగా చెప్పాలి," వేలు పైకెత్తి యకోవ్ ప్రొకొపిచ్ ఎంతో గంభీరంగా చెప్పాడు. "మర్యాద నీ మూడో బాధ్యత. పర్యాటకులకు ఉలికిపాటు ఎక్కువ, ఒకరకంగా జబ్బు మనుషులనవచ్చు. వాళ్లతో నువ్వు మర్యాదగా ప్రవర్తించాలి."

"అది చెప్పనవసరంలేదు యకోవ్ ప్రొకొపిచ్, ఆ విషయం నాకు ఒదిలెయ్యి."

సంచాలకుడితో మాట్లాడటం యెగర్‌కి ఇబ్బంది అనిపించలేదు: యకోవ్ అరవ లేదు, తిట్టలేదు, హడావుడి పెట్టలేదు. అవసరమైన విషయాలు ప్రశాంతంగా చెప్పాడు.

"పడవలను నేనే అద్దెకు ఇస్తాను. కానీ, ఎవరినైనా అవతలి ఒడ్డుకి చేర్చాల్సి ఉంటే అది నీ పని. వాళ్లు ఎక్కడ దింపమంటే అక్కడ పడవని ఆపాలి. సామాను దింపటంలో వాళ్లకి సహాయం చేయాలి. వాళ్లు ధన్యవాదాలు చెప్పిన తరువాతే అక్కడినుంచి కదలాలి."

"అంటే ధన్యవాదాలు చెప్పిన తరువాతే అక్కడినుంచి వెళ్లాలన్నమాట, అంతే కదా?"

"అది ఉదాహరణకు చెప్పాను, పొలుష్కిన్, అది కేవలం ఉదాహరణ మాత్రమే. వాళ్లు ఇక వెళ్లు అనవచ్చు – అప్పుడు నువ్వు వెళ్లిపోవచ్చు."

"తెలిసింది."

"అన్నిటికంటే ముఖ్యమైన విషయం పర్యాటకులకు సహాయపడటం. వాళ్లకి అవసరమైతే మంట వేయటంలో సాయం చెయ్యి. ఇంకొక మాటలో చెప్పాలంటే వాళ్లు చెప్పినట్టు నడుచుకో."

"అహ్, అలాగే..."

యెగార్ వంక సాలోచనగా చూసి, "ఎప్పుడైనా మరపడవ నడిపావా?" అని యకోవ్ ప్రొకొపిచ్ అడిగాడు.

"ఓ, నడిపాను!" ఈ ప్రశ్న యెగార్‌కి ఆనందాన్ని ఇచ్చింది. ఎందుకంటే ఇది అతడి వడ్రంగం నైపుణ్యానికి సంబంధించినది కాదు. ఇది అతని విధికి మించినది, అసాధారణమైనది.

అందుకే ఈ నైపుణ్యం పట్ల అతడికి ఎంతో గర్వం. "నేను ఎన్నో మరపడవలను నడిపాను, యకోవ్ ప్రొకొపిచ్! మా ఊళ్లో పెద్ద పెద్ద చెరువులు ఉన్నాయి! ఒక్కొక్కసారి మా ఛైర్మన్ నన్ను–"

"ఏ మరపడవలను నడుపుతావు?"

"అహ్, అది... పవన్‌ని నడపటం వచ్చు. బాణం కూడా నడుపుతాను."

"మన దగ్గర పవన్ రకానివి మూడు మరపడవలు ఉన్నాయి. ఇవి చాలా విలువైనవి – ఈ విషయం నువ్వు అర్థం చేసుకోవాలి. అవి నా పేరుమీద నమోదు అయి ఉన్నాయి. వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి: వాటిని నీ వ్యక్తిగత బాధ్యత మీద మాత్రమే నీకు ఇస్తాను. చెరువులో సుదూర ప్రాంతానికి మాత్రమే దానిని అనుమతిస్తాను: మిగిలిన అన్ని ప్రాంతాలకు నువ్వు తెడ్డు పడవలను ఉపయోగించాలి."

"మరపడవల విషయంలో నేను మంచి నిపుణుడిని! నువ్వేమీ బెంగపెట్టుకోవాల్సిన అవసరం లేదు! అదంతా నాకు కొట్టిన పిండిలాంటిది!"

అయితే దూర ప్రాంత పర్యాటకులు అంత త్వరగా రాలేదు, దాంతో మరపడవ వాడాల్సిన అవసరం వెంటనే రాలేదు. దగ్గర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు, యువకులు తెడ్డు పడవలను మాత్రమే అద్దెకు తీసుకునేవాళ్లు. ఈ వ్యవహారమంతా యకోవ్ ప్రొకొపిచ్ స్వయంగా చూసుకునేవాడు. ఉన్న వస్తువులకు రంగు వేయటం, మరమ్మతు చేయటం వంటి పనులను యెగార్ ఇష్టంగా చేస్తుండేవాడు. అతడికి అలసట కూడా ఆనందంగా అనిపించేది, కమ్మగా నిద్ర పట్టేది. అతడి నవ్వు కూడా మారింది: దాంట్లో తొందర లేదు, పరుగు లేదు, ఒకమాదిరి అలసటగా...

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:

Kinige.com